డిటెక్టివ్ స్టోరీ

# అపహరణ!

విన్ధ్యావాసిని

**ఫిబ్రవరి 7, శనివారం రాత్రి 1.00 గంట, రింగ్‌రోడ్**

**అప్పుడే సినిమా అయిపోయి బయటికొచ్చారు బాబు, సతీష్. పార్కింగ్ నుంచీ మోటార్ సైకిల్ బయటికి తీశారు. మోటార్ సైకిల్ స్టార్ట్ చేసుకుని బయలుదేరిన వాళ్ళు, అరగంటలో రింగు రోడ్డు దాటి మైసూర్ రోడ్ చేరుకున్నారు. అంతవరకూ సినిమా గురించే సాగాయి మాటలు.**

**మైసూరు రోడ్ ప్రవేశించగానే కాంపస్ దగ్గరకొచ్చేసినట్లు అనిపిస్తుంది. అయినా ఎప్పుడూ బిజీగా వుండే ఆ ప్రాంతం ఎందుకో ఈ రోజు అసాధారణంగా నిర్మానుష్యంగా ఉంది.**

**ఏడో సెమిస్టర్ కంప్యూటర్ ఇంజనీరింగ్ ఈ మధ్యే ప్రవేశించిన ఆ ఇద్దరికీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో తమ కోర్సు వల్ల ఉద్యోగావకాశాలు సున్న అని తెలుసు. మూడేళ్ళ క్రితం కష్టపడి చదివి తెచ్చుకున్న సీట్లవి!**

హఠాత్తుగా ఇద్దరి మనసులూ సినిమాను విడిచి తమ భవిష్యత్తు వైపు వెళ్ళాయి.

''నీకేంరా, మీ డాడీ నిన్ను ఆస్ట్రేలియాకు పంపి ఎమ్.ఎస్ చదివిస్తారు. ఉద్యోగ ప్రయత్నానికి కాస్త వాయిదా పడుతుంది. నా గతేమవుతుందో?''

బాబుకు బాధేసింది. బాబుది కర్నూలు. వాళ్ళ నాన్నగారు పెద్ద వ్యాపారవేత్త. సతీష్‌కు తండ్రి చిన్నప్పుడే పోయాడు. తల్లి అనంతపూర్‌లో కాలేజీ లెక్చరర్. ఇద్దరూ ఆర్‌వీ కాలేజ్‌లో చేరి, హాస్టల్లో రూంమేట్స్ అయాక మంచి స్నేహితులయ్యారు.

బాక్ లైటు వెలుగులో కాస్త దూరంలో ఒకతను తన బైక్ ఆపి, కింద మునిగాళ్ళమీద కూర్చుని ఏదో తంటాలు పడుతుండటం కనిపించింది. ఏమయినా సహాయం కావాలేమోనని బాబు తమ మోటార్ సైకిల్ ఆపాడు.

అదే వాళ్ళు చేసిన తప్పు! మసక వెలుతురులో నలుపు మీసాలు, గెడ్డం వెనుక దాగి ముఖం కూడా బాగా కనిపించని ఆ ముప్పయిఏళ్ళ మనిషి నిదానంగా లేచి నిలుచుని, జేబులో ఉన్న చాకు తీసి చూపుతూ బెదిరించాడు. తమ దగ్గరున్న విలువయిన వస్తువులిచ్చేస్తే చాలు అనుకున్నారు వీళ్ళు.

సతీష్ ''ఏం కావాలి నీకు?'' అన్నాడు కాస్త క్షీణమయిన స్వరంతో. చీకటి ముఖం వాడేమీ అనకముందే, అక్కడ పక్కనే చెట్లలో కొంచెం దూరం నుంచీ మారుతి ఎస్టీమ్ కారొచ్చి వీళ్ళ దగ్గర ఆగింది. అందులోంచి దిగిన రెండో గెడ్డంవాడు, ''ఏరా కిట్టూ? బాబుగాడేనా దొరికింది!'' అని సందేహం తీర్చుకుని తనపని మొదలుపెట్టాడు.

బాబును, సతీష్‌ను తాళ్ళతో కట్టి కార్లో వేసుకుని, రజాక్ అనే గెడ్డంవాడు వెళ్ళిపోయాడు. నలుపు ముఖం కిట్టు, తను కూచుని నటిస్తున్న పాత రిపేరు బైకును అక్కడే వదిలేసి, బాబు మోటార్ సైకిల్ తీసుకుని బయలుదేరాడు.

ఐదు నిముషాల్లో ఆ రోడ్డు అంతవరకూ ఏదో జరిగిన ఆనవాళ్ళు కూడా లేకుండా మళ్ళీ నిర్మానుష్యమయిపోయింది.

***

ఫిబ్రవరి 8, ఆదివారం మధ్యాహ్నం - 2.00 గంటలు హుళిమావు హౌసింగ్ బోర్డ్ లేఔట్.

వీరేశ్‌కు బనశంకరి షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర బట్టల దుకాణం ఉంది.

ఆదివారం అర్ధరోజే దుకాణం తెరుస్తాడు. అతడు పదిహేనేళ్ళ క్రితం ఆ దుకాణం తెరిచినప్పట్నించీ అదే అలవాటు. ఆ రోజు తన మారుతి 800 కారు సర్వీసింగ్‌కి వెళ్ళింది. అందుకని సరిగ్గా ఒంటిగంటకు కాంప్లెక్స్ ముందు స్టాప్‌లో ఆగిన కొత్త వోల్వో ఏ.సీ. బస్ ఎక్కాడు వీరేశ్.,

అరగంటలో జీడిమాను దగ్గర ఆగింది బస్. అంతవరకూ కూర్చునే నిద్రపోతున్న వీరేశ్ లేచి కూర్చున్నాడు. ఇంకొక పదినిముషాల్లో తను దిగవలసిన స్టాప్‌వస్తుంది. భార్య గౌరి, ఇద్దరు కూతుళ్ళు శుభ, విభ టీవీ చూస్తూ భోంచెయ్యకుండా తనకోసం కాచుకుని ఉంటారు.

విభ బి.ఏ, బి.ఎడ్ చేసి స్కూలు టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. శుభ డిగ్రీ చదువుతోంది. ఆ ఇంట్లో అతని రెండు కళ్ళకు వెలుగయి మెరిసే ఇద్దరు కూతుళ్ళను పెళ్ళిళ్ళు చేసి పంపించెయ్యవలసి ఉండటం మాత్రం అతనికి న్యాయంగా కనిపించదు. 'ఇద్దరూ వెళ్ళిపోతే గౌరిని తెచ్చి దుకాణంలో కూర్చోబెట్టుకోవలసిందే! లేకపోతే తోచదని నన్ను తినేస్తుంది!' అనుకుంటాడు అతడు.

బస్ హుళిమావులో ఆగింది. వీరేశ్ బస్ దిగి ఫర్లాంగు దూరం ఉన్న తన ఇంటివైపు నడవసాగాడు. ఆ రోజు ఆదివారం కావడం వల్లనేమో హౌసింగ్ బోర్డ్ లేఔట్ రోడ్లలో మనుష్య సంచారం లేదు.

వెనుకనుంచీ ఏదో మోటార్ సైకిల్ వస్తున్న శబ్దం విని ప్రక్కకు జరిగాడు. బైక్ వచ్చి అతని ప్రక్కనే ఆగింది.

ఎక్కడికయినా అడ్రస్ కావాలేమో అని బైక్ మీదున్న ఇద్దరు వ్యక్తుల వైపు చూచాడు. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడే వాళ్ళలా దిగి నిలుచున్నారు. ఒకతను జేబులో ఉన్న కత్తి తీసి చూపిస్తూ, ''అంకుల్, మీకేం భయంలేదు. మాట్లాడకుండా వీడితో వెళ్ళండి'' అన్నాడు. వాళ్ళ మాటల తీరు గమనించిన తర్వాత, వీరేశ్ ఏం మాట్లాడీ ప్రయోజనం లేదని అర్థం చేసుకున్నాడు. నిశ్శబ్దంగా మోటార్ సైకిలెక్కి కూర్చున్నాడు. రెండవ మనిషిని అక్కడే వదిలేసి బైక్ అక్కడ్నించీ వెళ్ళిపోయింది.

***

ఫిబ్రవరి 8, ఆదివారం

సుభాష్ బెంగుళూర్లో మంచి ప్రాక్టీసున్న ఎస్టేట్ లాయర్. బాగా బిజీగా ఉంటాడు. అతనికి ఏడు రోజులూ పనుంటుంది. అందుకనే అతను ఎప్పుడయినా శని - ఆదివారాల్లో తీరుబాటు చేసుకొని కుటుంబాన్ని బయటికి తీసుకెళ్ళగలిగితే, అతని భార్య, ఇద్దరు కొడుకులకూ కొండెక్కినంత సంతోషం!


శనివారం పిల్లలు స్కూళ్ళనుంచి తిరిగొచ్చాక బయలుదేరి, అందరూ మైసూరికి వెళ్ళారు. డ్రైవర్‌కు కూడా సెలవిచ్చి సుభాషే స్టీరింగ్ చేతికి తీసుకున్నాడు.

ఒకటిన్నర రోజు సంతోషంగా గడిపిన తరువాత

రెండు గంటలుగా కార్లో ప్రయాణిస్తున్న అయిదేళ్ళ చిన్న, ఏడేళ్ళ హర్ష బాగా అలిసిపోయి నిద్ర పోతున్నారు. సుభాష్ భార్య దీపిక మాత్రం కబుర్లు చెప్తూ అతనికి కంపెనీ ఇస్తోంది.

బెంగుళూరి దగ్గరికి స్తున్నామనే మాటేగానీ, నిజంగా ఆ రోడ్ భాగంలో ఉండే ట్రాఫిక్ వల్ల మరో గంటసేపు పడుతుంది ఇల్లు చేరేలోపల. సుభాష్ ఒక చోట కారు రోడ్‌లో ఒక ప్రక్కకు తీసుకెళ్ళి ఆపాడు. "ఇప్పుడే వస్తా" అని చెప్పి కారు దిగి రోడ్డు పక్కనున్న చెట్టు పొదల్లోపలికి వెళ్లాడు. వీళ్ళిద్దరు తమ లోకంలో తాముండి గమనించని విషయం ఒకటి జరిగింది. ఇతను కారు ఆపగానే, వెనకాల కొంచెం దూరంలో వీళ్ళను వెంబడిస్తున్న నలుపు ఎస్టీం కారు పక్కనున్న పొదల వెనుకలికి వెళ్ళటం సుభాష్ చూడలేదు. అందులో కిట్టు, రజాక్ కూర్చుని ఇతని కోసమే కాచుకుని ఉన్నారు.

దీపిక అయిదు నిముషాలు చూసింది. భర్త రాకపోవడంతో ఆమె గుండె కొట్టుకోవడం మొదలుపెట్టింది! ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అంతలో హర్ష లేచి కూర్చుని "మామ్! ఏమయింది? డాడీ ఏడీ?" అని అడిగాడు.



సుభాష్ వెళ్ళినవైపు చూపించింది దీపిక. హర్ష పరుగెత్తి వెళ్ళి వెతికాడు. వెనక్కొచ్చి చెప్పాడు, "మామ్! అక్కడ నల్ల కారొకటి వెళ్తూ కనిపించింది!" అన్నాడు. ఇద్దరూ ఒకటే ఆలోచిస్తున్నారు. 'ఆ కార్లో సుభాష్ వెళ్ళిపోయాడు!' అని. వీళ్ళను నడిరోడ్లో వదిలేసి అతను వెళ్ళిపోయే అవకాశం లేదు. అంటే ఏదో బలవంతమే అయుండాలి!

అదృష్టం కొద్దీ దీపికకు డ్రైవింగ్ వచ్చు. కాస్త సిటీకి దగ్గర పడుతూ కొన్ని దుకాణాలు, ట్రాఫిక్ కనిపించగానే కారాపి, పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసి కంప్లెయింట్ చేసింది.

***

ఫిబ్రవరి 6, శుక్రవారం మధ్యాహ్నం – 12.00 గంటలు – బిన్నీ మిల్స్ దగ్గర ఒక పాడుబడిన గోడవున్.

నలుగురూ కలిసి మూడు నెలలుగా కష్టపడి వేసుకున్న అపహరణల ప్రణాళిక బుర్ర సుబ్బు, కిట్టు అయితే, రజాక్, ఇస్మాయిల్, శరీరంలాగ అతి కష్టం మీద ఈ స్థలం తమ స్థావరం చేసుకోవడానికి పనికొస్తుందని కనుక్కుని అక్కడ చేరారు, తమ ప్లానుకు రూపమివ్వడానికి.

వీళ్ళ నలుగురి ఆలోచన ఇది. బాగా డబ్బున్నవాణ్ణొకణ్ణి అపహరించి డబ్బుకోసం సతాయించడంలో రిస్క్ ఎక్కువ. అందుకు బదులు కొందరు మధ్యస్తుగా ఉన్నవాళ్ళను ఒకేసారి అపహరిస్తే ఎన్నో రకాలుగా డబ్బు సంపాదించొచ్చు.

రజాక్, ఇస్మాయిల్ ప్రార్థన చేసుకోవడానికి మసీదుకు వెళ్ళారు. సుబ్బు, కిట్టు తమ లాప్‌టాప్ ఆన్ చేసుకుని తమ కిడ్నాప్ లిస్ట్ చెక్ చేస్తున్నారు.

వీరేశ్ – 40 ఏళ్ళు – బట్టల దుకాణం ఓనర్ (బెంగుళూరు)

సతీష్ – 20 ఏళ్ళు – ఇంజనీరింగ్ స్టూడెంట్ (బెంగుళూరు)

బాబు – 20 ఏళ్ళు – ఇంజనీరింగ్ స్టూడెంట్ (బెంగుళూరు)

రాజు – 30 ఏళ్ళు – కాలేజ్ లెక్చరర్ (మైసూర్)

క్రిష్ణ – 14 ఏళ్ళు – హైస్కూల్ విద్యార్థి (బెంగుళూరు)

రంగయ్యశెట్టి – 50 ఏళ్ళు – బంగారు నగల దుకాణం ఓనర్ (మంగుళూరు)

సుభాష్ – 40 లాయరు (బెంగుళూరు)

సుధీర్ – 40 – టైర్ల దుకాణం వ్యాపారి (షిమొగ్గ)

రాజు, క్రిష్ణ, రంగయ్య సెట్టి, సుధీర్ల పేర్ల పక్కన టిక్కు పెట్టుకున్నారు. మిగతా ముగ్గురూ బెంగుళూరు వాళ్ళను శని – ఆదివారాలు మాత్రమే 'కాచ్' చెయ్యొచ్చు. అదీ కాక మైసూరు, మంగుళూరు 'కాచెస్' కాస్త టైం పడతాయి. అందుకని వాటిని ముందు ముగించారు. దొరికిన వాళ్ళంతా లోపల ఒక మూల గదిలో బంధించబడి ఉన్నారు. అందర్నీ ఒక చోట పెట్టడం తప్ప అక్కడ వేరుగా చేసేంత చోటు లేదు.

"ఆ ఇడియెట్స్‌కు తినబెట్టావా?" అడిగాడు కిట్టు.

"ఆ! నిన్నటివి రెండు రొట్టెలుంటే సెట్టికిచ్చినాను. వీడొకడ్రా మనకు. లేని రోగాలు లేవు. చపాతీ లేకపోతే ఏమీ తినడు. అన్నం తింటే షుగర్ లెవెల్ ఎక్కువౌతుందని బెదిరిస్తాడు"


"వాడి దగ్గర డబ్బు గుంజడం సులభంరా! అందుకనేగదా వాణ్ణి లిస్ట్‌లో ఎక్కించాం!"

క్రిష్ణని, సెట్టిని తెచ్చిన మూడురోజులవరకూ వాళ్ళింటికి ఫోన్ చెయ్యడం వాయిదా వేసుకున్నారు. ఇంట్లోవాళ్ళకూ కాస్త 'టెన్షన్' అవ్వాలి కదా! రాజును, సుధీర్ను రెండు రోజుల్నుంచీ వీపుమీద చారలు పడేలా కొడుతున్నారు. అందరిదగ్గర ఉన్న వాచీ, చైను లాంటి విలువయిన వస్తువులు వీళ్ళకు వద్దు. వాట్ని వదిలించుకుని డబ్బు చేసుకోవడంలోనే కష్టముంది. వాళ్ళకు డబ్బు, నోట్లు కావాలి. వాళ్ళిద్దర్నీ ఒప్పించి, ఏ రాత్రో బాంకుల ఏటీఎంలు నింపేసిన తర్వాత సమయంలో, రెండు ఏటీఎంలు ఎన్నుకుని వాళ్ళతోనే పెద్దమొత్తాల్లో డబ్బు తీయించాలని ప్లాను.

***

ఫిబ్రవరి 8, ఆదివారం రాత్రి – 9.00 గంటలు – కిడ్నాప్ టాస్క్ ఫోర్స్ కంట్రోల్ రూం

పోలీస్ కంట్రోల్ రూంకు దీపిక చేసిన ఫోన్ కాల్ టాస్క్ ఫోర్స్ కంట్రోల్ రూంకు చేరింది. ఇన్స్పెక్టర్



జోసెఫ్ తీసుకున్నాడా కాల్. డీసీపీ సలీమ్ తొమ్మిది గంటలకు మీటింగ్‌కు పిలిచారు.

సలీం, జోసెఫ్, శివరాం, సిద్ధార్థ నలుగురూ మీటింగ్‌రూం చేరారు.

ఇన్స్‌పెక్టర్లు ముగ్గురూ తాము రిసీవ్ చేసుకున్న కాల్స్ గురించి సలీంకు చెప్పారు.

''సర్! ఏడు గంటలకొకరు ఆడవాళ్లు ఫోన్ చేశారు. బనశంకరిలో బట్టల అంగడి పెట్టుకున్నతను వీరేశ్ ఇంటికి రాలేదు. సెల్‌ఫోను స్విచ్-ఆఫ్ అయిందిట,'' అన్నాడు శివరాం.

''షిమొగ్గ, మంగుళూర్నించీ కూడా ఒక టైర్ల దుకాణం ఓనర్ సుధీర్ అనే అతను, రంగయ్యశెట్టి అనే ఏభయ్యేళ్ళ నగల వ్యాపారి మాయమయినట్లు తెలుస్తోంది'' సిద్ధార్థ తనకు తెలిసింది కలిపాడు.

''ఆ వీరేష్ ఇంట్లో వాళ్ళకు చెప్పకుండా ఇంకెక్కడికయినా వెళ్ళాడేమో కనుక్కోండి. శివరాం, నువ్వెళ్ళి అతని భార్యను, కూతుళ్ళనూ ప్రశ్నించి చూడు''

''ఇదేదయినా అంతర్జాతీయ ముఠా చేస్తున్న పనా?'' సలీమ్ అనుమానం. జోసెఫ్ సాలోచనగా అన్నాడు. ''అలా అనిపించదు సార్! అన్ని అపరహణలు ఒకే గాంగు పనే అయితే వీళ్ళ ప్లాను కొత్తగా ఉంది. కాస్త మీడియమ్ లెవెల్లో డబ్బున్నవాళ్ళను అపహరిస్తున్నారు. మనకు తెలిసినంతలో అన్ని కేసులూ మన రాష్ట్రమే కాబట్టి అంతర్జాతీయమని అనిపించడం లేదు''

''అసలు ఇవన్నీ ఒకదానికొకటి కనెక్ట్ అయి ఉన్నాయని కూడా అనుకోలేం కదా సర్?'' జోసెఫ్ అనుమానం. సిద్ధార్థ్ సాలోచనగా, ''ఒక్కొక్క అపహరణ వేరువేరయితే, ఇట్ డజెంట్ మేక్ సెన్స్! వీళ్ళలో ఎవరిని గట్టిగా కొట్టినా, లక్షల్లో డబ్బు రాలదు! బంగారు నగల దుకాణం సెట్టి విషయం చెప్పలేం!'' అని పెదవి విరిచాడు.

''మనకు తెలిసినవి నాలుగు అపహరణలు. ఇందులో ఒకదాన్లో ఒక నలుపురంగు ఎస్టీమ్ కారు ఉపయోగించినట్లు తెలుస్తుంది. మిగతా వాటి విషయం తెలుసుకోండి!'' అన్నాడు సలీం.

శివరాం అన్నాడు, ''ఇన్ఫార్మర్స్ ద్వారా చాలావరకూ మామూలుగా మేం అనుమానించే వాళ్ళను అందర్నీ గురించీ కనుక్కున్నాం. ఏమీ క్లూ దొరక్కుండా ఉంది. వీళ్లెవరో మన దగ్గర రికార్డుల్లో లేనట్లనిపిస్తుంది''

''సరే. లెట్ అస్ వెయిట్ అండ్ సీ. ఏ క్రిమినల్ అయినా ఒక తప్పు చెయ్యకుండా ఉండడు. ఏదో ఒక 'ఎక్స్‌టార్ట్' అయిన కుటుంబం మనకు సహాయం చేస్తారని అనుకుందాం''

***

ఫిబ్రవరి 8, ఆదివారం రాత్రి – 8.00 గంటలు – బిన్నీ మిల్స్ దగ్గర గోడవున్.

కసువు దిబ్బలా ఉన్న ఆ విశాలమయిన గదిలో వీరేశ్, రంగయ్య శెట్టి కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మిగతా వాళ్ళు క్రిష్ణ, సుధీర్, సతీశ్, బాబు, రాజు చాపమీద

గుంపుగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

రాజును, సుధీర్‌ను శనివారం సాయంత్రమే గోడ వున్ నుంచి రజాక్, సుబ్బు కార్లో బయటికి తీసుకె ళ్ళారు. వాళ్ళిద్దరి కాళ్ళు, చేతులు కట్టేసి ఉండటమే కాక, కళ్ళకు గంతలు కట్టి ఉన్నాయి. బయలుదేరే ముందు గంట క్రితమే, ఇద్దర్నీ చొక్కాలు విప్పమని వాతలు పడేలా కొట్టి బాగా బెదిరించి తర్వాతే కారె క్కించారు. కళ్ళకు గంతలు కట్టి ఉండటం వల్ల వీళ్ళకు ఎక్కడికెళ్ళిందీ తెలియదు. దాదాపు ఒక గంట తర్వాత, ఒక చోట కారు ఆగింది. రాజును, సుధీర్‌ను ఒక చీప్ లాడ్జింగ్‌లో ఒక గదిలో తీసుకెళ్ళి పడేశారు. అసలు



## మీరే డిటెక్టివ్!?

*నిర్వహణ: అన్య*

## పవర్ కట్

''ఇన్వెస్టిగేషన్‌లో మీ సహాయం కావాలి'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

''ఇంతకూ ఏం జరిగింది?'' అంటూ పైప్ వెలిగించాడు డిటెక్టివ్.

''ఓ కాటేజ్‌లో హత్య జరిగింది. ఇద్దరు మిత్రులు కలిసి పార్టీ చేసుకోవటానికక్కడి కెళ్లారు. రాత్రి సుమారు పదకొండు గంటల ప్రాంతంలో ఒకతను పరిగెత్తుకొచ్చి ''హత్య జరి గింది. నా మిత్రుణ్ణి ఎవరో కాల్చిచంపారు'' అని చెప్పాడు. కానిస్టేబుల్‌ను వెంట బెట్టుకుని కాటేజ్ కెళ్లి చూశాను. మృతుడి ఛాతీమీద ఎడమ వైపున బులెట్ తగిలింది. దగ్గర నుండే షూట్ చేశారెవరో. ''మేం టీవీ చూస్తున్నాం. సడెన్‌గా కరెంట్ పోయింది. నేను లేచి టేబుల్ సొరుగులో వున్న కాండిల్‌కోసం వెదికాను. అంతలో ఎవరో అపరిచితుడు, తలుపు తోసుకుని లోపలికి ప్రవే శించి, నా ఫ్రెండ్‌ను క్లోజ్ రేంజ్‌లో కాల్చాడు. నేనా షాక్ నుండి తేరుకునే లోపే కరెంట్ వచ్చింది. లైట్లు వెలిగాయి. ఒక నిమిషం పాటు గదంతా నిశ్శబ్దం వ్యాపించింది. ఏం చెయ్యాలో తోచలేదు. నేను మీ వద్దకు పరిగెత్తుకు వచ్చాను. ''అంటూ అతడు తన వాంగ్మూలం రికార్డు చేశాడు'' అని చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

''ఇంకెందుకు సందేహం. అతడే హంతకుడు. అరెస్టు చెయ్యండి'' అన్నాడు డిటెక్టివ్.

ఏ ఆధారాలతో డిటెక్టివ్ ఆ నిర్ణయానికి వచ్చాడు?

సమాధానం: కరెంట్ పోయినప్పుడు టీవీ చూస్తున్నామని చెప్పాడతను. కరెంట్ వచ్చిన తర్వాత ఒక నిమిషం గదంతా నిశ్శబ్దంగా వుందని చెప్పాడు. కరెంట్ రాగానే, వెంటనే, టీవీ శబ్దం చెయ్యలేదా?

తమను అక్కడికెందుకు తెచ్చారో, ఏం చేస్తారో వీళ్ళకు తెలీదు. అయోమయంగా, భయంగా కాచుకుని కూర్చుని అలసిపోయి మగతగా తూగుతున్నారు.

తర్వాత జరిగింది సుధీర్ అప్పుడే అందరికీ చెప్పాడు. రాజు మళ్ళీ చాపమీద ఉన్న గుంపుకు వివ రిస్తున్నాడు.

''మమ్మల్ని ఏటీఎం దగ్గరికి తీసుకెళ్ళి కార్డ్ ఉప యోగించి డబ్బు తియ్యమన్నారు''

రాజు, ''పదిలక్షలు తీసిస్తే మమ్మల్ని వదిలేస్తామ న్నారు!'' అన్నాడు.

క్రిష్ణ ఆశ్చర్యంగా, ''వాళ్ళు చెప్తే మీరు నమ్మేశారా అంకుల్?'' అని అడిగాడు.

''ఎకౌంట్‌లో అంత డబ్బు లేదని చెప్పాను. అయిదు లక్షలే ఉంది. ప్లాటు కొనాలని తీసిపెట్టుకున్నాను''

సుధీర్, ''ఇద్దరం భయపడి తీసిచ్చేసాం. నాకు తెలుసు. వదిలేసేది ఒట్టిమాట. వాళ్ళకంత ధైర్యం లేదు. మేం వెళ్ళి పోలీసులకు పట్టిస్తామని భయం!''

తలుపు తెరిచిన శబ్దానికి ఉలిక్కిపడ్డారు. ఇస్మా యిల్ చేతులు, కళ్ళకు గంతలు కట్టేసి ఉన్న సుభాష్‌ను లోపలికి తెచ్చాడు.

''ఇంకొక బక్రానా?'' అని గొణిగాడు క్రిష్ణ.

***

ఫిబ్రవరి 9, సోమవారం మధ్యాహ్నం – 12.00 గంటలు – బిన్నీ మిల్స్ దగ్గర గోడవున్.

సుబ్బుకు ఆదివారం రాత్రి జరిగింది నచ్చటం లేదు. రజాక్‌తో అన్నాడు.

''ఈ ముసిలి సెట్టిని తేకుండా ఉండాల్సింది మనం! వీడు గుండె పట్టుకుని చస్తాడేమోనని భయం?''

''అందుకే కదా పంపిచ్చెయ్యాల్సొచ్చింది?''

రాత్రి సెట్టిని బెదిరించి ఆయన ఇంటివాళ్ళకు డబ్బుకోసం ఫోన్ చేయిద్దామనుకున్నారు. రెండు దెబ్బలు వీపుమీద పడేసరికి ఆయన తట్టుకోలేకపో య్యాడు. గుండె నొప్పి వచ్చింది. ఆయనదే తీసిపె ట్టిన జిప్–బాగ్‌లోంచి ఏదో మందు తీసి వేసుకు న్నాడు. కాస్సేపటికి నీరసంగా పడుకున్నాడు. వీళ్ళకు అతను చచ్చిపోతే అదో పెద్ద గొడవ అని భయం! వీళ్ళందర్నీ కొట్టి బెదిరించి డబ్బు చేసుకునే ప్లానేకానీ, ఎవరినీ చంపే ఉద్దేశం లేదు. ఉదయం ఆరుగంటలకే రంగయ్య సెట్టిని బస్టాండుకు తీసుకెళ్ళారు ఇస్మా యిల్, కిట్టు. ఆయన్ను మంగుళూరు బస్‌లో పడేసి ఇంటికి పంపించెయ్యాలని ఉద్దేశ్యం!

క్రిష్ణను లోపల్నుంచీ బయటికి తీసుకొచ్చారు, డబ్బు అడుగుతూ వాడి ఇంటికి ఫోన్ చేసే ప్లాన యినా అమల్లో పెడదామని.

***

ఫిబ్రవరి 10, మంగళవారం ఉదయం – 10.00 గంటలు – టాస్క్‌ఫోర్స్ కంట్రోల్ రూం

ఇన్స్‌పెక్టర్లు ముగ్గురూ మాట్లాడుతూ కూర్చుని ఉన్నారు. రంగయ్య సెట్టిని కిడ్నాపర్లు వదిలేశారన్న వార్త తెలిసింది. కానీ అతను ఇంటికొచ్చినప్పట్నుంచీ ఆస్పత్రిలో ఐ.సీ.యూలో ఉన్నాడు. పోలీసులను లోపలికి రానివ్వడం లేదు.

అంతలో ఫోను మోగింది. సిద్ధార్థ తీసుకుని స్పీకర్ ఆన్‌చేసి పెట్టాడు. ఎవరో మగ గొంతు. బాగా భయప డుతున్నట్లుంది. ''నా పేరు రాజారాం. మా అబ్బాయి క్రిష్ణ నాలుగు రోజులనుంచీ కనిపించడం లేదు''

''ఇన్ని రోజులెందుకు ఆలస్యం చేసారు?''

''ముందు ఎక్కడికయినా స్నేహితుల దగ్గరికి వెళ్ళాడేమో అనుకున్నాం. మేమిద్దరం, చిన్న పాపా, బాబులను తీసుకుని వెళ్ళాము. వచ్చేసరికి వీడు లేడు. అందుకని ఒక్కడే బోర్ కొట్టి...''

''అయితే ఇప్పుడేం జరిగింది. ఫిర్యాదు చేస్తు న్నారు?''

''కిడ్నాపర్లు ఫోన్ చేసి మళ్ళీ ఫోన్ చేస్తామన్నారు. అప్పుడు ఎంత డబ్బు కావాలో చెప్తామన్నారు. నేను భారత్ కో ఆపరేటివ్ బాంకులో మేనేజర్ని. నాకు బాంకు డబ్బు అందుబాట్లో ఉంటుందని మావాణ్ణి అపహరించినారేమో! నన్ను నమ్మండి సార్! నేనలా చెయ్యలేను. అందుకని ఫోన్ చేస్తే మీ టాస్క్‌ఫోర్స్ కాంటాక్ట్ ఇచ్చారు''

''మీ ఇంటి ఫోన్లో కాలర్ ఐడీ ఫెసిలిటీ ఉందా? ఏ నంబర్నుంచీ చేసారో ఏమయినా తెలిసిందా?''

''అదే సార్! ఆశ్చర్యం ఆ నంబరు నా మొబైలుది. అదెలా సాధ్యం? నాకేమో భయంగా ఉంది సార్!''

'ఇదెలా సాధ్యం? కాల్‌ఫోన్లనుంచీ చేసేవాళ్ళను ట్రాక్ చేసి పట్టుకోవచ్చు' అని ఇన్స్‌పెక్టర్లు ముగ్గురూ ముఖాలు చూసుకున్నారు.

సిద్ధార్థ్ ఆయన దగ్గర అడ్రస్ తీసుకున్నాడు. ''మా స్టాఫ్ ఇద్దరు మీ ఇంటికొస్తారు. రెండో కాల్ వచ్చిన ప్పుడు ట్రేస్ చెయ్యగలమేమో చూద్దాం. మీరేం కంగా రుపడొద్దు. మా సహాయం మీకుంటుంది!''

క్రిష్ణ తండ్రికి ధైర్యమయితే చెప్పాడు కానీ నిజంగా వీళ్ళకు అతనికెలా సహాయం చెయ్యాల్లో అర్థం కాలేదు. అతని మొబైలు ఫోను ద్వారా అతని ఇంటికే ఎలా ఫోన్ చేసారన్నది అందరూ ఎంతసేపు తలలు పగులగొట్టు కున్నా అర్థంకాలేదు. వాళ్ళు తర్జనభర్జనలు పడుతోం డగా సలీం ఎప్పుడొచ్చాడో తెలియలేదు. ''మీరు కాల్ స్పూఫింగ్ గురించి ఈ రోజు పేపర్లో చదవలేదా?'' అన్న ఆయన స్వరం విని అటు చూసారు.

శివరామ్ పరుగెత్తాడు, అవతల టేబిలు మీదున్న ఆవాళ్టి పేపర్ల కట్టవైపు. ముగ్గురూ ఆ రోజు పేపర్ల చుట్టూ చేరారు. తెలిసిందేమిటంటే కంప్యూటర్, ఇంటర్నెట్ ద్వారా ఈ పని చెయ్యొచ్చు. ఇంటర్నెట్‌లో కొన్ని వెబ్‌సైట్లలో ఈ అనుకూలం ఉంది. మనం సైటు ద్వారా, ఒక ఫోన్ నంబర్ ఉపయోగించి మరో ఫోనుకు కాల్ చెయ్యొచ్చు. రాజారాం గారింటికి కాల్ ఎలా వచ్చుండొచ్చో అర్థమయింది.

శివరాం ఉసూరుమంటున్నట్లు, ''ఇదొకటి, నేరస్తు లకు బాగా పనికొచ్చే ఇంకొక టెక్నాలజీ!''

అంతలో కానిస్టేబుల్ దీపికను వెంటపెట్టుకుని లోపలికొచ్చాడు. ''ఈమేమో చెప్పాలంట సార్! పేరు దీపిక అంటున్నారు'' అని, దీపిక ఎవరో వీళ్ళకు ముందే తెలుసు. భర్త మాయమయినప్పుడు ఫిర్యాదు చేసింది. ఇప్పుడేమయింది అన్నట్లు కుతూహలంగా చూసారు ఆమెవైపు. ''కిడ్నాపర్లు ఫోన్ చేసి ఇరవై లక్షలు కాష్ ఇస్తే గానీ నా భర్తను వదిలిపెట్టమంటు న్నారు. నేనిప్పుడంత ఎక్కడ్నుంచీ తెచ్చేది? మీ సహాయం కోసం వచ్చాను,'' దీనంగా చెప్పింది దీపిక.

''నా మొబైల్ ఫోన్‌కే చేశారు. మళ్ళీ చేస్తారట!''

అందరికీ ఒకటి అర్థమయింది. ఇందులో కాల్

స్నూఫింగ్ లేదు. ఇది వేరే గాంగ్ అయే అవకాశం ఉంది. లేదా కంప్యూటరో, ఇంటర్‌నెట్ లింకో ఆ వెధవలకు 'హేథ్' ఇచ్చిఉండాలి.

''ఈ ఫోనుకొచ్చే కాల్స్ మీ ఇంటికొచ్చేలా ఫార్వర్డింగ్ చేద్దాము. కాల్ వస్తే మాకు, మీకు కూడా తెలుస్తుంది. మీరే కాల్ తీసుకోండి. మేము సంభాషణ రికార్డ్ చేస్తాము'' అని చెప్పి సిద్ధార్థ్ ఆమెను పంపించాడు.

***

ఫిబ్రవరి 8, మంగళవారం సాయంత్రం - 5.00 గంటలు - బిన్నీ మిల్స్ దగ్గర గోడవున్.

అపహరణ ప్రణాళిక అమల్లో పెట్టేముందు లాప్‌టాప్‌వి నాలుగు స్పేర్ బాటరీలు కొనుక్కుని తెచ్చుకున్నారీ గాంగ్. దురదృష్టవశాత్తు రెండు బాగా పనిచేశాయి. మూడోది అరగంట, నాలుగోది ఇరవయి నిముషాలు పనిచేసి చచ్చిపొయ్యాయి. ఈ గోడవును సిటీకి దూరం ఉంది కాబట్టి కొత్త బాటరీ తెచ్చేలోపల మూడు గంటలు పైనే పడుతుంది. క్రిష్ణ ఇంటికి మొదటి కాల్ చేసిన తర్వాత బాటరీ ఖాళీ అయిపోయింది. కిట్టుది సెల్‌ఫోను ఉపయోగించి దీపికకి కాల్ చేశారు. కాల్ చేసిన తరువాతి పదినిముషాల్లో సిమ్ కార్డ్ తీసి కనిపించనంత దూరంలో పడేశారు. క్రిష్ణ ఇంటికీ, దీపికకూ రెండో కాల్ కోసం ఇంకొక సెల్‌ఫోన్ ఉపయోగించి ఆ సిమ్ కూడా పారెయ్యాలని ప్లాను.

క్రిష్ణను బయటికి తీసుకొచ్చారు. వాళ్ళింటికి ఫోన్ చేసి తండ్రి రాజారాంతో మాట్లాడారు. సంజయ్ నగర్ అవతల ఉన్న శ్మశానానికి వెళ్ళే దార్లో ఒక పాత గేటు, పక్కనే శ్మశానానికి దారి కనిపిస్తాయి. రాత్రి పదిగంటలకు రాజారాం ఒక్కడే ఇరవయి లక్షలు తీసుకుని అక్కడికిరావాలి. క్రిష్ణతో మాట్లాడించి ఆయన్ను నమ్మించారు. ఆయన కారు అరమైలు దూరంలో ఉన్న దారి చూపించే పసుపురంగు బోర్డు దగ్గర ఆపి రావాలి. అతడు డబ్బు వాళ్ళకిచ్చి వెను తిరిగి కారు దగ్గరికి వెళ్ళేలోపు క్రిష్ణ అక్కడ కూర్చుని ఉంటాడు.

క్రిష్ణనులోపల వదలేసి సుభాష్‌ను తీసుకొచ్చి దీపికకు ఫోన్ చేసి మాట్లాడించారు. ఆమెకు మాత్రం వెంట ఆమె కొడుకును తెచ్చుకోవడానికి అనుమతించారు. స్థలం రాజారాంకు చెప్పిన చోటే, కానీ ఆమెను తొమ్మిదింటికి రమ్మన్నారు. అనుకున్న ప్రకారం సిమ్ తీసి దూరం తీసుకెళ్ళి పడేశారు.

***

ఫిబ్రవరి 10, మంగళవారం మధ్యాహ్నం - 3.00 గంటలు - టాస్క్‌ఫోర్స్ కంట్రోల్ రూం

రాజారాంకు వచ్చే ఫోన్ కాల్ ట్రేస్ చెయ్యటానికి, దీపికకు వచ్చే ఫోన్ కాల్ ట్రేస్ చెయ్యటానికి అవసరమయిన ఏర్పాట్లు చేసుకుని కాచుకుని ఉన్నారు ఇన్‌స్పెక్టర్లు, ఫోన్ మోగింది. మంగుళూరునుంచీ ఫోను. ఇన్స్‌పెక్టర్ గణేష్ చేస్తున్నాడు. కాల్ తీసుకున్న శివరాం, ''హాస్పిటల్‌లో రంగయ్య సెట్టితో పోలీసులను మాట్లాడనిచ్చారట'' అని చెప్పాడు వెంటనే స్పీకర్ పెట్టగానే జోసెఫ్, సిద్ధార్థ్ కూడా శ్రద్ధగా వినసాగారు.

గణేష్ కొనసాగించాడు. ''అక్కడెంత మందిని అపహరించింది, వాళ్ళపేర్లు, వివరాలు, కిడ్‌నాపర్ల వయస్సులు, పేర్లు ఆయన చెప్పినవన్నీ లిస్ట్ చేశాం. ఆ పేపరు ఫాక్స్ పంపుతాను!''

''వాళ్ళను ఉంచిన చోటు వివరాలేమయినా తెలిసాయా?''

''వీళ్ళను చాలా వరకూ గంతలు కట్టి తిప్పినందు వల్ల, ఆయన మంగుళూరు వాడుకావడం వల్ల చోటేదో అర్థం కాలేదనుకుంటా సార్!''

''పోనీ ఎక్కువసేపు గడిపిన గది గురించి అయినా ఏమయినా చెప్పగలిగాడా?''

''అదొక పాత పాడుబడిన ఫాక్టరీ గోడవున్‌లా విశాలమయిన హాలులాంటి కిటికీలు లేని గది, చాలా ఎత్తులో కప్పు! ఇంత చెప్పగలిగాడు.''

జోసెఫ్, సిద్ధార్థ్‌లు శివరాం వైపు చూశారు. అతడు ముందు ట్రాఫిక్‌లో పనిచేశాడు. పోలీస్ డిపార్ట్‌మెంటు వాళ్ళిచ్చిన బ్లాక్‌బెర్రీ జేబులోంచి బయటికి తీసి కొన్ని కాల్స్ చేశాడు. పదినిముషాల్లో అతనికి తెలిసిన వివరాలివి.

సిటీకి కొద్దిగ దూరంలో పాత ఇండస్ట్రియల్ ఏరియాల్లో వాడకుండా వదిలేసినా కొంచెం ఉపయోగించగల గదులున్న మిల్లులు దాదాపు యాభయి వరకూ ఉన్నాయి. వీటిలో మామూలుగా క్రిమినల్స్ ఉపయోగించగల చోట్లేవో కూడా కనుక్కున్నాడు శివరాం. ఆ కొన్ని స్థలాలు త్వరగా చెక్ చేయాలంటే ఎక్కువ సిబ్బందే కావాలి. ఆలస్యంగా భోజనానికి వెళ్ళిన సలీం అప్పుడే తిరిగొచ్చాడు. అతనితో ఆథరైస్ చేయించుకుని కొందరు క్రైమ్ స్టాఫ్‌ను ఆ పనిమీద పెట్టారు. అలా వెళ్ళినవాళ్ళకు ఏ కాస్త అనుమానం వచ్చినా టాస్క్‌ఫోర్స్ ఎచ్.క్యూ కు ఫోన్ చెయ్యాలి.

ఆరుగంటలలోపు, రెండు కిడ్‌నాపర్ల కాల్స్ రికార్డ్ అయాయి. జోసెఫ్ రాజారాంకు ఫోన్ చేసి మాట్లాడాడు. రాజారాం భయంగా అడిగాడు ''ఎంతో కష్టం మీద వాళ్ళడిగిన పదిలక్షలు చేర్చాను సార్! అంతా తీసుకుని వాళ్ళు ఆయన కొడుకును అప్పగించకపోతే ఏం చేయను?'' అని. ''అలా జరగదులెండి. మేం మీ వెంట ఉంటాము. మేము దాక్కుని ఉండి వాళ్ళను పట్టుకోవడం అంత కష్టమేం కాదు'' అని ధైర్యం చెప్పాడు.

దీపికే శివరామ్‌కు ఫోన్ చేసి మాట్లాడింది. ఆమె వ్యక్తం చేసిన భయం కూడా రాజారాం అనుమానం లాంటిదే. శివరాం, రాజారాంకు జోసెఫ్ చెప్పిన లాంటి మాటలే చెప్పి ధైర్యం చెప్పాడు.

వాళ్ళిద్దరి మాటలు వింటూ ఆలోచిస్తున్నాడు సిద్ధార్థ్. రాత్రి 'రాన్సమ్' డబ్బు వెంట పోలీసులు వెళ్ళటం చివరిమార్గం! అంతలోపల కిడ్నాపర్ల స్థావరం కనుక్కోగలిగితే బాగుణ్ణు. వాళ్ళందర్నీ ఇప్పుడే విడిపించవచ్చు. సెర్చ్ పార్టీ ఆ గోడవున్ కోసం గాలిస్తున్నావాళ్లు ఈ ప్రయత్నంలో విజయం సాధించడానికి లక్ అయినా కావాలి. లేదా సమయమయినా ఎక్కువ కావాలి. మొదటిది ఉందో లేదో తెలీదు. రెండోది అసలు లేదు. నిముష నిముషానికి ఆలస్యం అవుతోంది. నిశ్శబ్దంగా తన బ్లాక్‌బెర్రీ వైబ్రేట్ అవుతుంటే చూసుకున్నాడు. పరధ్యానంగానే కాల్ తీసుకున్నాడు.

అక్కడ విన్న విషయాలతో ఒకటి ధృఢమయింది. కిడ్నాపర్లు అపహరించిన వాళ్ళను బిన్నీ మిల్స్ గోడవున్‌లో పెట్టారు. అక్కడినుంచే వాళ్ళ ప్రణాళిక అమల్లో పెడుతున్నారు. లోపల చేంబర్లో ఉన్న సలీం దగ్గరికెళ్ళి విషయం వివరించాడు.

తర్వాత అన్నీ చకచకా జరిగిపొయ్యాయి.

***

ఫిబ్రవరి 11, బుధవారుం ఉదయం - 9.00 గంటలు - టాస్క్‌ఫోర్ ఆఫీస్ మీటింగ్ హాల్

కిడ్నాప్ టాస్క్ ఫోర్స్ డీసీపి మహమ్మద్ సలీం ప్రెస్ కాన్ఫరెన్స్‌కు పిలిచాడు. మీడియా వ్యక్తులు, జర్నలిస్టులు వరుసలుగా కూర్చుని ఉన్నారు. లోపల ఒక గదిలో సుభాష్, సుధీర్, క్రిష్ణ, వీరేశ్, బాబు, సతీష్ కుర్చీలో కూర్చుని ఉన్నారు. మరో గదిలో టేబిలుమీద దుండగుల స్థావరంలో స్వాధీనం చేసుకున్న మూడు రివాల్వర్లు, నాలుగు మొరటు కత్తులు, రెండు ఇనుప కడ్డీలు ఉన్నాయి.

అందరూ బయటికొచ్చాక ప్రశ్నలు మొదలయ్యాయి. చివర్లో వచ్చింది ముఖ్యమయిన ప్రశ్న. ''అసలు కిడ్నాప్ ముఠా స్థావరమేదో ఎలా కనుక్కున్నారు?'' సలీమ్ పక్కనే కూర్చుని ఉన్న సిద్ధార్థ్ ఆయన్ను మాట్లాడనివ్వకుండా ''ఇవి కూడా మీరు ప్రచురిస్తే, భవిష్యత్తు కిడ్నాపర్లకు సహాయం చేసినట్లవుతుంది'' అన్నాడు నవ్వుతూ. బలవంతం మీద సమాధానం బయటికి రాక తప్పలేదు. ''కిడ్నాపర్ల ఫోన్‌కాల్స్ రికార్డ్ చేసిన పరికరాల్లో, జీ.ఎస్.ఎమ్ టెక్నాలజీ ఎంబెడ్ అయి ఉంటుంది. దీని ద్వారా కాల్ వచ్చిన స్థలం కో-ఆర్డినేట్స్ తెలుస్తాయి. వాటిని బెంగుళూరు మాప్‌మీద ఉపయోగించి ఆ చోటేదో, యాభయి చదరపు మీటర్ల విస్తీర్ణం వరకూ కనుక్కున్నాం'' అన్నారు.

*



## ప్రేమలో పడిన కాజల్!

'మగధీర'తో యువకుల హృదయాలను దోచుకున్న కాజల్ అగర్వాల్ హృదయాన్ని టాలీవుడ్‌లో ఓ యువహీరో దోచుకున్నాడు. ఆ హీరోతో కాజల్ పీకల్లోతు ప్రేమలో మునిగిపోయిందని టాలీవుడ్‌లో పుకార్లు వినిపిస్తున్నాయి. షూటింగ్‌లో ఉన్నా 24 గంటలూ హీరోగారితో ఫోన్‌లో మాట్లాడడానికే కాజల్‌కి సమయం సరిపోవడం లేదన్నది మరికొందరి అభియోగం. హీరోతో మాట్లాడడం కోసం కొన్ని సినిమాలను కూడా కాజల్ త్యాగం చేసింది. ఇంతకీ కాజల్‌ను అంత ఘాటు ప్రేమలోకి దింపిన హీరో ఎవరు అన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్!